# 6. విధి వరించిన తీర్పు

జల్లులు జల్లులుగా వాన కురుస్తున్నది. కిటికీ తలుపులు కొట్టుకుంటున్నవి. అప్పుడప్పుడు మెరుపులు, ఉండుండి ఉరుములు. చినరాజుకి జ్వరం తగ్గలేదు. లేచివెళ్లి కిటికీ తలుపు పూర్తిగా తీశాడు. ఒక్కసారిగా వానజల్లు లోపలికి వచ్చి అతని చొక్కా తడపింది. చల్లగాలి ఇంకా హెచ్చుగా లోపలికి వచ్చింది. మెరుపొకటి మెరిసింది. సముద్రంలో అలలు చింపిరి జుత్తులా అల్లుకు పోయాయి. దూరంగా డాల్ఫిన్సునోసు మీద దీపస్తంభపు వెల్తురు కారు చీకట్లలో దోబూచులాడుతున్నది.

లైటు వేశాడు. రంగయ్య తెచ్చి పెట్టిన పాలు అలాగే టేబిలు మీద ఉన్నవి. చినరాజుకి ఆకలివేసి నట్లయింది. కొంచెం పాలు తాగాడు. మరి తాగాలని అనిపించలేదు. ఆపిల్ పండ్లు పక్కనే వున్నాయి. కత్తికూడా అందుబాటులోనే వుంది. కాని కోసుకోడానికి అతనికి బద్ధకం వేసింది. ఒకపండు కొరికి విడిచి పెట్టాడు. కావలసినవన్నీ అమర్చడంలో రంగయ్యకెంత ప్రజ్ఞ ఉంది!

అతని ఆలోచనలకు అంతంలేదు. అలా ఆలోచిస్తుంటే అతనికి నిద్రపట్టింది. కిటికీ తలుపులు మూయలేదు. చల్లగాలికి కప్పుకోలేదు. ఆ నిద్రలో అతనికి మెలకువ ఉంది. మెలకువలో నిద్రపోతున్నాడు. మెరుపుల వెలుతురు, ఉరుముల చప్పుడు. అతని లోకం మాత్రం అతనిది.

అతను ఎవరికీ అక్కరలేదు. అతని దగ్గిరఎవరూ వచ్చి ఉండరు. ఎవరూ రాకుండా ఉంటేనే బాగుంటుంది. ఎవరు వచ్చినా విచారించే వారే. పాపం!ఎంత విచారిస్తారు! గది దాటగానే అందరూ మరిచిపోతారు. ఎవరికి కావాలతను? అతని తండ్రికి కూడా అతను కావాలా? ఈ ప్రశ్నకు చినరాజుకి జవాబు దొరకలేదు.

చినరాజు మధ్యాహ్నం జరిగిన సంఘటన మరచి పోదామనుకుంటాడు. కాని అదే జ్ఞాపకం వస్తుంది. రాజుగారు వచ్చారు. ఆయనతో ఒక నడి వయసు ఆవిడ వచ్చింది.

"మావాణ్ణి గురించే అప్పుడప్పుడు ఆలోచించ వలసి వస్తుంది. తల్లిలేనివాడిని ఇంతవరకు తీసుకుని వచ్చాను. ఈ తగని రోగం ఎక్కడ దాపరించిందో!" అన్నాడు రాజుగారు.

"మీవంటి చదువుకున్న వాళ్ళుకూడా ఇలా అజ్ఞానంలో పడతారా! లోకమంతా మీ

బిడ్డలేకదా!" అంది ఆవిడ.

చినరాజు మనస్సు చివుక్కుమంది.

"వాడికి లోటేం చేయలేదు. ఈ కాటేజ్ వాడి ఆరోగ్యం గురించే ప్రత్యేకంగా ఏర్పాటు చేశాను. పేరు పొందిన స్పెషలిస్టుని పెట్టాను. మందులకు, మిగిలిన సదుపాయాలకు కొరతలేదు'

"మీ మంచితనం ఎవరు కాదనగలరు! కాని నేను ఒకందుకు విచారిస్తున్నాను. ఈ చింతలో పడి మీరు రాబోయే ఎన్నికల సంగతి మరిచి పోతున్నారు." అంది ఆవిడ

చినరాజు మాట్లాడలేదు. రగ్గు కొంచెం మీదకు తీసుకొని గోడవేపు ముఖం తిప్పుకున్నాడు.

"అబ్బాయి చిన్నబోయి నట్లున్నాడు. వాడి మనస్సు నొప్పించడం నా అభిమతం కాదు' ' అన్నారు రాజుగారు.

తరువాత సంగతి చినరాజుకి తెలియదు...నిద్రలో మునిగిపోయాడు.

చినరాజుకి తెలివి వచ్చింది. అతని మీద రగ్గు కప్పి వుంది. అప్పటికి బాగా ఎండ వచ్చింది. రంగయ్య గది శుభ్రం చేసి ఉంటాడు. వేళ తొమ్మిదయింది.

"ఇవాళ డాక్టరుగారు వస్తానన్నారు, మీరు లేస్తారా?"

"రంగయ్యా! ఎవరూ నన్ను చూడటానికి వీలు లేదు,. ఎవరితోను మాట్లాడడానికి కూడా నాకు శక్తి లేదు"

"డాక్టరుగారిని కూడానా!"

"అవును."

"వంట్లో బాగా లేనప్పుడు డాక్టరుగారి నొక్కరినే చూడవలసింది, మరెవ్వరిని రానివ్వను.'

"లేదు రంగయ్యా! ఆయన లక్ష ప్రశ్నలు వేస్తాడు. నాకు జవాబు చెప్పే ఓపిక లేదు. ఈ బ్రతుకు మీద నాకు ధ్యానం లేదు."

"బాబుగారు ఇలాంటి మాటలు అనకూడదు"

బయట కారు వచ్చి ఆగినశబ్దం వినిపించింది. తరవాత బూట్ల చప్పుడు. డ్టారుగారు. ఆయన వెనక బాగ్ పట్టుకుని కంపొండరు వచ్చారు.

రంగయ్య ఏమీ మాట్లాడలేదు. డాక్టరుగారు కూడా ఏమీ అట్టే ప్రశ్నలే వేయలేదు. గడిచిన నెల బిల్లు అయిదు వందల రూపాయలు. రంగయ్య అతని చేతిలో పెట్టాడు. నవ్వుతూ ఆయన వెళ్ళిపోయాడు. కంపొండరుకు పది రూపాయలు ముట్టాయి. అతను నమస్కారం చేసి వెళ్ళిపోయాడు.

చినరాజు బట్టలు మార్చుకొని కూచున్నాడు. మబ్బులు లేవు. గాఢమైన నీలం పులుముకొన్న సముద్రం నల్లకొండను అలలతో కొడుతూంది. హార్బరులోకి రాబోయే స్టీమర్లు రెండు దూరంలో తచ్చాడు తున్నవి.

రంగయ్య కొడుకు చిట్టిగాడు వచ్చాడు బంతిలా వున్నాడు. అందమైన ముఖం, వెడల్పైన కళ్ళు, సూదిముక్కువాడు. ఎప్పుడూనవ్వుతూనే వుంటాడు. చినరాజు దగ్గరగా వచ్చి ముఖంలోకి చూసి,

"రాత్రి నిద్రపోలేదా?" చనువుగా అడిగాడు.

చినరాజుకు నవ్వు వచ్చింది.

"నీ కళ్ళు లోతుకు పోయాయి"

"అవును సరిగా నిద్రపోలేదు"

"అయితే పడుక్కో. మధ్యాహ్నం పేకాడుదాం"

"నాకు నిద్ర రావటం లేదు. ఇప్పుడే ఆడుకుందాం"

"మరి టేబుల్ దగ్గరికి రా"

"నేను రాలేను. మంచం మీదనే ఆడుకొందాం"

"నీకు దూరంగా కూచుని ఆడుకోమన్నాడు మానాన్న"

"ఎందుచేత?"

"నీకు దూరంగా కూచుని వుండాలని, నువ్వు ఎంగిలి చేసిన పళ్ళు తినరాదని, విడిచిన పాలు తాగరాదని చెప్పాడు"

"మరెందుకు వచ్చావు?"

"నువ్వొక్కడివీ వుంటావని వచ్చాను. నాన్న బజారుకు పోయాడు. పొద్దున్న నాన్న చూడకుండా ఆపిల్ పండు ఎత్తుకుపోయి చాటుగా తిన్నాను. ఎంత బాగుందను కొన్నావ్! నాన్నను కొనమంటే ఏమంటాడు?"

"ఏమంటాడు?"

"బీదవాళ్ళం,. మనకీ పళ్ళెందు కంటాడు"

చినరాజు మొహం కొంచెం చిన్నపోయింది.

"ఇలా అన్నానని నీకు కోపం వచ్చిందా?"

"కోపం లేదు చిట్టీ!"

"పళ్ళు ఎంత బాగుంటాయో మరి!"

"చిట్టి! నేను ఎంగిలి చేసిన పళ్ళు తినకు."

"నీకు మంచి పళ్ళు యిస్తాను. రోజా నాతో మాట్లాడడం మానేయకు. తీసుకో ఈ మంచి పండు." అని ప్రక్కనే వున్న మంచిపండు ఇచ్చాడు.

చిట్టి ముఖం సంతోషంతో వికసించింది. పండు తీసికొని, దగ్గరలో వున్న పాకకు పరిగెత్తాడు.

రంగయ్య బజారునుంచి వచ్చాడు. చిట్టి చేతులో పండు చూస్తే అనుమానం వేసింది. నూకమ్మ చెప్పింది. చినరాజుకూడా చెప్పాడు. ఇకమీదనుంచి ఏమితెచ్చినా చిట్టికికూడా ఇమ్మని, రంగయ్య ఆలోచిస్తూ తన పాకకి తిరిగివచ్చాడు. పిల్లడు పండుకొరుక్కొని తింటున్నాడు. పెద్దపండేమో, ముఖంనిండా రసం అంటుకొంది.

రంగయ్య ముఖంలో సంతోషం తోచలేదు. చంటిపిల్లకు పాలిస్తున్న నూకమ్మ మొగుడి ముఖంలో గల మార్పు గమనించింది.

"నిజం మామా! చిట్టిగాడు ఇవన్నీ తినడం మరుగుతే మనం పెంచలేము"

రంగయ్య జవాబు చెప్పలేదు. పండు తింటున్న కొడుకువేపు చూశాడు. కొంచెం దూరంఓవున్న కాటేజివైపు చూశాడు. చినరాజు పడుకొన్న మంచం కనుపించింది.

రంగయ్య మందు తీసుకొని వచ్చాడు. ఎండ తగ్గిపోయింది. లాన్‌మీద చినరాజు కూర్చొని వున్నాడు. చిట్టిగాడు ఎదురుగుండా మొగ్గలు వేస్తున్నాడు. చినరాజు నవ్వుతున్నాడు. రంగయ్య మందు లోపలపెట్టి వచ్చాడు.

"బాబుగారూ! చల్లనిగాలి. మీరు ఇలా బయట తిరగకూడదు."

"అవును రంగయ్యా! నేను బయట తిరగ కూడదు. కాని లోపల కూర్చోలేక పోతున్నాను. పడుకోలేక పోతున్నాను. చిట్టిగాడు మొగ్గలు వేస్తుంటే అలా మెల్లిగా నడిచి వచ్చాను. గాలి బాగులేకపోతే వెళ్ళిపోతానులే"

చినరాజు మెల్లిగా లేచి లోపలికి వెళ్ళిపోయాడు. రగ్గుతీసి కప్పుకున్నాడు. సముద్రంవేపు తిరిగి కళ్ళనిండా తిరిగిన నీళ్ళలో ఏమీ చూడలేక పోయాడు. చక్కని సాయంకాలంవేళ నీరసంగా పడుకున్నాడు.

రంగయ్య రాత్రి చిట్టిని చావమోదాడు. చినరాజుకి కనిపిస్తే ఒళ్ళు చీరేస్తానన్నాడు. మరునాడు రంగయ్య బజారుకు వెళ్ళి పళ్ళు తెచ్చాడు. చినరాజు ఒకపండు తీసికొని చిట్టిగాడికియ్యమన్నాడు. రంగయ్య వినిపించుకోనట్టు టేబిలుమీద వస్తువులు సర్ది తన మానాన్న తనువెళ్ళి పోయాడు.

చినరాజు రెండురోజులై పళ్ళు తినలేదు. పాలు సరిగా తాగలేదు. మందు సరిగా పనిచెయ్యలేదని రంగయ్యకు అనుమానం వేసింది. డాక్టరు మామూలుగావచ్చి వెళిపోతున్నాడు. కేసు ఎప్పుడో చేతినుంచి జారిపోతుందని, అంతవరకు డాక్టరుగారు రాబట్టుకోవలసినది రాబట్టుకొంటున్నారని కంపౌండరు ధైర్యంగా మరొకరితో అంటున్నాడు. రంగయ్యకు ఆ రాత్రి నిద్రపట్టలేదు.

అలవాటు చొప్పున పొద్దున్న చిట్టిగాడు కాటేజ్ దగ్గర బంతి పూలు కోయడానికిపోయి, వరండాలో నిలుచున్న చినరాజుని చూచి ముఖం దించుకొని వెనుకకు వచ్చాడు. చినరాజు విసురుగాపోయి మంచంమీద కూల బడ్డాడు. దూరంగా మామిడి చెట్టుక్రింద నిలుచుని ఇదంతా గమనించిన రంగయ్య గుండె బద్దలయింది.

రంగయ్య బజారుకుపోయాడు. పోతూ ఆలోచించాడు. ఒక నిర్ణయానికి వచ్చాడు. బజారునుండి రాగానే చిట్టిగాడి చేతికి రెండు పళ్ళిచ్చి "వీటిని చినబాబుగారికియ్యి" అన్నాడు. చిట్టిగాడు తండ్రి ముఖంలోకి చూచాడు. రంగయ్య నవ్వాడు. చిట్టిగాడి ముఖం చాటంత అయింది. పళ్ళుతీసుకొని పరిగెత్తాడు కాటేజ్ వైపు.

చినరాజు మంచంమీద కూచున్నాడు. పుస్తకం తిరగవేస్తూ చిట్టిగాడు జాపోసుకుంటూ వచ్చి, "ఇవిగో రెండుపళ్ళు. నీ కొకటి, నా కొకటి" అన్నాడు.

చినరాజు ఏమీ అర్థంకాక చూశాడు.

"తీసుకో, మానాన్న పంపించాడు. మా నాన్న కోపం పోయింది'

చినరాజు మాట్లాడలేదు. పండు తీసుకోలేదు.

"నువ్వు తీసుకోకపోతే నేను తిననులే" అని చిట్టిగాడు పళ్ళు రెండూ టేబిలుమీద పెట్టి మెల్లిగా వెనుకకు నడిచాడు.

చినరాజు మరి మనస్సుపట్టలేక పోయాడు. "చిట్టీ! రా! నేను తీసుకొంటున్నా. తీసుకో నీ పండు, వెళ్ళిపోకు" అని దీనంగా అన్నాడు.

సాయంకాలం నీరెండలో లాన్‌మీద చినరాజు కూర్చున్నాడు. చిట్టిగాడు బంతి ఎగరేసి ఆడుతున్నాడు. చినరాజు నవ్వుతున్నాడు. చంటిపిల్లను చంకనేసుకొని నూకమ్మ పాకబైట నిలబడి రంగయ్యకు వాళ్లిద్దరినీ చూపించింది. మొక్కలకు గొప్పులు త్రవ్వుతున్న రంగయ్య ఆలోచిస్తూ వాళ్లవైపు ఒకసారి చూచి తిరిగి తన పనిలో నిమగ్నుడయ్యాడు.

చినరాజు ఇల్లు చేరుకొనేసరికి రాత్రి పదిదాటిపోయింది. స్కూలు వార్షికోత్సవానికి నాటికలు వేశారు. ప్రహసనంలో పెద్దకడుపువాడి పాత్ర జ్ఞాపకానికి వచ్చి చినరాజు నవ్వుకుంటూ లోపలికి వచ్చాడు.

లైటువేసి గది నలుమూలలు చూశాడు. పరుపుపైని దుప్పటి సరిగాలేదు. టేబిలుమీద కేరియరులో భోజనముంది. ప్లేటు, చెంచా, మంచినీళ్ళు, ఒక గ్లాసుతో పాలు టేబిలుమీద కనుపించాయి.

చినరాజుకి బాగా ఆకలి వేస్తున్నది. వేగంగా కాళ్ళుచేతులు కడుక్కొని, బట్టలు మార్చుకొని, భోజనం చేశాడు. దుప్పటి దులిపి సరిగా పరచాడు. సావకాశంగా మంచంమీద నడుంవాల్చి, కిటికీలోంచి సముద్రంవేపు చూశాడు. అప్పుడే సముద్రంలోంచి ముక్కపోయిన చందమామ

బయట పడుతున్నాడు. వెలుగులేని వెన్నెలలో అలలు కదం తొక్కుతున్నవి.

చినరాజు నిద్రపోయాడు. మరి రెండు నెలల తర్వాత స్కూలులో చేరి చదువుకొంటాడు. రాజుగారు కొత్తకారు కొనిపెడతా నన్నారు. డాక్టరుగారు తరచు రావడంలేదు. ప్రపంచంలోని అందం, ఆనందం చినరాజుకు కనిపిస్తున్నాయి. రాజుగారు ఎన్నికలలో నెగ్గారు. ఆయనకు అప్పుడు మరి తీరుబడిలేదు. వచ్చేవారు, వెళ్ళేవారు, ఆయన దేశాన్ని బాగుచేయడానికి కంకణం కట్టుకొన్నారు.

రంగయ్య రెండుమూడు రోజులై సరిగా వేళకు భోజనం తేవడం, పొద్దున్న పాలుకాచి ఇవ్వడం చేయలేక పోతున్నాడు. చినరాజు అంతగా పట్టించుకొనేవాడు కాదు. కాని రోగం తగ్గి బాగా ఆకలివేస్తున్న వేళల్లో రంగయ్య సరిగా అందుబాట్లు చేయలేకపోతే విసుక్కొనేవాడు. కొన్నిసార్లు కోపపడడం కూడా జరిగింది.

ఏమడిగినా రంగయ్య జవాబు చెప్పకుండా సూటిగా చినరాజువైపు చూసేవాడు. చిన్నప్పటి నుండి గల చనువుతో అలా ప్రవర్తిస్తున్నాడని చినరాజు అనుకునేవాడు. ఏమీ అర్థంకాక, ఏమీ అనలేక వూరుకొనేవాడు.

ఒకరోజు చినరాజు భోజనానికి ఇంటికి వచ్చేసరికి మధ్యాహ్నం ఒంటిగంట అయింది. బాగా ఆకలిగా వుంది. గది తలుపులు తీసి చూస్తే లోపల భోజనం కారియరులేదు. గదికూడా శుభ్రంగాలేదు. పక్కమీద దుప్పటి పొద్దున్న ఎలాగుందో అలాగేవుంది. కూజాలో నీళ్ళుకూడా లేదు. పోనీ పాలుగాని, పళ్ళుగాని ఉంచాడా అంటే అవికూడా లేవు.

కాళ్ళు కడుక్కొని బట్టలు మార్చుకొని మంచంమీద చేరబడి చినరాజు నిద్రపోయాడు. మూడుగంటల వేళకి మేల్కొన్నాడు. భోజనం వచ్చింది. రంగయ్యను పిలిచాడు. రంగయ్య ఇంట్లోలేడు. ఏదోకతికి తిరిగి రావడానికి బీచికి వెళ్ళిపోయాడు చినరాజు.

ఈ సంఘటన జరిగిన నాలుగయిదు రోజుల తరువాత ఒకనాటి రాత్రి రంగయ్య ఎప్పటికీ రాలేదు. టేబిలుమీద రెండు పళ్ళుమాత్రం వున్నాయి. రంగయ్యను రెండుమూడుసార్లు పిలిచాడు. రంగయ్య ఎంతకూ రాకపోతే తిన్నగా పాకవైపు నడిచాడు. తలుపుమూసి వుంది. తలుపు తెరిచిచూస్తే లోపల చీకటి. మనుషుల సవ్వడికూడా లేదు.

"చిట్టీ! నూకమ్మా!" ఎవరూ పలకరు. చినరాజుకి పరిస్థితి అర్థంకాలేదు. ఉన్న పళ్ళుతిని కాసిని మంచినీళ్ళు తాగి, దీపమార్పి మంచంమీద చేరబడి ఆలోచించాడు.

చినరాజుకి చిట్టిగాడు జ్ఞాపకం వచ్చాడు. వంట్లో బాగా ఆరోగ్యం కుదిరిన తరువాత తనుపూర్తిగా చిట్టిగాడి సంగతే మరచిపోయాడు. రెండునెలలక్రింద ఒక సంగతి జరిగింది. ఆవేళ చినరాజు పుట్టినదినం. రాజుగారు రాలేకపోయారు. ఖరీదైన బట్టలు, చినరాజు స్నేహితులకు పంచిపెట్టడం గురించి చిన్నచిన్న బహుమతులు ప్రత్యేకంగా ఒక మనిషిచేత పంపించారు.

కాటేజ్ బయట లాన్‌మీద తివాసీలు పరిచి వచ్చిన పిల్లలకు ఫలహారాలు పంచిపెట్టారు. చిన్నచిన్న బొమ్మలు, బొమ్మల పుస్తకాలు స్నేహితులకు పంచిపెట్టాడు చినరాజు.

చిట్టిగాడు ఒక మంచి బొమ్మ తీసుకోవాలని ప్రయత్నించాడు. అప్పుడు చినరాజు కోపంగా వాడివేపు చూశాడు. చిట్టిగాడు పౌరుషంతో ఆ బొమ్మను చినరాజు మీద విసిరి దూరంగా పాకదగ్గర నించున్న తల్లిదగ్గరికిపోయి ఆమె చీర చెంగులో ముఖం దాచుకొన్నాడు. ఆనాటినుండి చిట్టిగాడు కాటేజ్‌వేపు రావటం లేదు.

చినరాజుకి తీరిక లేకుండా పోయింది. ఏ లెక్చరర్ కొడుకో ఏ ప్లీడరుగారి అబ్బాయో, ఏ కౌన్సిలర్‌గారి తమ్ముడో, ఏ కమీషనర్‌గారి పుత్రుడో రావడం, కార్లలో తిప్పి తీసుకొని రావడం జరుగుతున్నది. రాజుగారి సెక్రటరీ తరచు వచ్చి వెళ్లడం చేస్తున్నాడు. గౌరవ మర్యాదలు పెరుగుతున్నవి. అందరి ఆదరణ హెచ్చుతున్నది. ఏకాంతంగా ఉన్న ఆరునెలలు తరవాత, తండ్రిగారు మంత్రిపదవిని అధిష్ఠించడంతో వచ్చిన మార్పులకు లొంగిపోయి, పాపం! చిట్టిగాడిని చినరాజు పూర్తిగా మరిచి పోయాడు.

అయితే చిట్టిగాడు, నూకమ్మ, రంగయ్య ఏమయినట్టు?

చినరాజు సావకాశంగా ఎనిమిది గంటలకు నిద్రలేచాడు. టేబుటుమీద దేవుడి విగ్రహ మొకటుంది. ఊదొత్తులు సువాసన గది నిండింది. పాలు, పళ్ళు, రొట్టె అన్నీ అమర్చి ఉన్నాయి టేబిల్‌మీద.

చినరాజు కేమీ అర్థంకాలేదు. "రంగయ్యా!" అని గట్టిగా పిలిచాడు.

రంగయ్యకు బదులు మరొకడు లోపలికి వచ్చాడు. వచ్చి నమస్కారం చేశాడు.

"బాబుగారూ! నేను వీరయ్యను. రంగయ్యతో అప్పుడప్పుడు వచ్చేవాడిని. గురుతుందా బాబూ!" అన్నాడు అతను.

"రంగయ్య ఏమయ్యాడు?"

"నిన్నరాత్రి ఊరెళ్ళిపోయాడు. నేను స్టేషనుకువెళ్లి వచ్చాను. తిరిగి వచ్చేసరికి చాల రాత్రయింది."

"కుటుంబం ఏమయారు?"

"వారం రోజుల క్రితమే వాళ్ళు వెళ్ళిపోయారు. వాళ్ల వెళ్ళిన తరవాత ఉత్తరం రాగానే నిన్న రాత్రి రంగయ్యకూడా వెళ్ళిపోయాడు. బాబుగారిచ్చిన అయిదు వందల రూపాయలలోను వంద పదిహేను ఖర్చయ్యాయి. మిగిలిన సైకం రంగయ్య నాచేతికిచ్చాడు. తమరి సెలవయితే రంగయ్యలాగే నమ్మకంగా అతని జాగాలో పనిచేసుకుంటాను."

ఇన్ని సంవత్సరాలయి పనిచేసి చెప్పకుండా రంగయ్య ఎందుకు వెళ్ళిపోయాడని చినరాజు కోపంతో మండిపడ్డాడు.

"బాబుగారికి తెలుసను కుంటాను. చిట్టిగాడు లేడూ, వాడికి తగని జబ్బు పట్టుకుంది. బాబూ! నెల్లాళ్ళయి జ్వరం వదలలేదు. దగ్గు, రోజురోజుకి పిల్లడు దిగజారి పోయాడు. పదిరోజులకింద పెద్దాసుపత్రిలో ఫోటో తీయించాడు. డాక్టరు ఏం చెప్పాడో మరి. మొగుడికి, పెళ్ళానికి ఆ రోజునుండి మతి మతిలాలేదు. నూకమ్మ మరి ఈ ఊళ్ళో ఉండలేనని చెప్పింది. కుటుంబాన్ని నూకమ్మగారి ఊరు పంపించాడు. ఇంకా బాగులేదని ఉత్తరం వస్తే నిన్న ఉన్న పాళంగా బయలుదేరి వెల్లిపోయాడు. తిరిగి వస్తాడో రాడో. మీదగ్గిర నమ్మకంగా పనిచేయమని. మీకు సదుపాయాలు సరిగా చూడమని, నాకు మీ మంచిచెడ్డలు అప్పగించి వెళ్ళిపోయాడు."

"రంగయ్యా! ఎంతపనయింది!" అంటూ చినరాజు నిలువునా మంచంమీద కూలబడి పోయాడు. కొంచెం సేపటికి తెప్పరిల్లి "వీరయ్యా! ఇంటిఖర్చుకి కొంత ఉంచి, మూడు వందలు టెలిగ్రాము మనియార్డరు ద్వారా రంగయ్యకు పంపు. వేరే ఉత్తరంకూడా రాయి. ఈ రోగానికి పళ్ళు, పాలు, బలమైన మందులుకావాలి. డబ్బు లేనిదే ఈ సదుపాయాలు కుదరవు. డబ్బు ఇంకా పంపుతానని రంగయ్యకు రాయి," అని చినరాజు అన్నాడు.

వీరయ్య పరిగెత్తి పోస్టాఫీసుకెళ్ళి డబ్బు పంపించాడు. చినరాజు మనస్సు మనస్సులో లేదు. ఏవో పాతజ్ఞాపకాలు వెంటబడి తరుముతున్నాయి. చక్కని ముద్దొచ్చే ముఖం, పౌరుషంగల పిల్లవాడు. ధనదర్పమే తనను వాడినుండి వేరుచేసింది. చినరాజు మరి ఆలోచించ లేకపోయాడు. చెమ్మగిల్లిన కళ్ళను తుడుచుకొని, కిటికిలోంచి కొండతో పోరాడే కెరటాలను చూసి నిట్టూర్చాడు.

ఆ రోజు రాజుగారు మధ్యాహ్నం మెయిలుకే వస్తున్నారని టెలిగ్రాము వచ్చింది. కమీషనరుగారు స్టేషనుకు వెళ్ళేటప్పుడు కారులో తీసుకొని పోతానని చినరాజుకు కబురు పంపించారు. వీరయ్య బల్లమీద భోజనానికి సర్దుతున్నాడు. పోస్టుమాను వీరయ్యను పిలిచి ఉత్తర మొకటి, తిరిగివచ్చిన మనిఆర్డరొకటి ఇచ్చిపోయాడు.

భోజనానికి కూర్చోబోతున్న చినరాజు ఒక క్షణం ఆగి వీరయ్య ముఖంలోకి చూశాడు.

"బాబుగారూ! భోజనం కానీయండి."

"పోస్టు బంట్రోతు ఏమి తెచ్చాడు?"

"అదే బాబూ! భోజనం తరువాత చెప్తాను."

"వీరయ్యా! ఏమయిందో ముందు చెప్పు." కొంచెం చిరాకుగా చినరాజు అన్నడు.

"ఏం లేదు బాబూ! పంపిన డబ్బు తిరిగి వచ్చింది. పిల్లడిని గురించి రంగయ్య రాయలేదు. డబ్బు అవసరం లేకపోయిందని రెండు పొడి ముక్కలు రాశాడు."

చినరాజు భోజనం దగ్గరినుండి లేచిపోయాడు. వీరయ్య ఏమీ మాట్లాడకుండా అక్కడినుండి వెళ్లిపోయాడు.

చినరాజు మంచంమీద చేరబడి కిటికీలోంచి చూశాడు. కొండ పాదాలను కడుగు